క్లుప్తంగా

పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రగతి శీల కార్మిక సమైఖ్య రాష్ట్ర క్యాదర్శి కొండారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట ఆటో యూనియన్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆటో యూనియన్ అధ్యక్షులు శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు బీజేపీ ప్రోత్సహిస్తోందని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించి 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మిక వేతనం 26 వేలు చేయాలని, తదితర డిమాండ్లతో ఈనెల 16వ తేదీ నిర్వహించనున్న సమ్మెకు కార్యకర్తలు, ఆటోడ్రైవర్లు, యూనియన్ నాయకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాజశేఖర్, ఆటో యూనియన్ బాధ్యులు ఎస్.కె.సైదా, కె.బాలు, కోటిరెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

నేడు భావనరుషి స్వామి కల్యాణ మహోత్సవం

తాడేపల్లిరూరల్: శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు బహూత్తమ సేవా సంఘం అధ్యక్షుడు వూట్ల సాంబశివ రావు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత మంగళగిరి శ్రీ భద్రావతి సమేత భావన రుషి స్వామి కల్యాణ మండపంలో వేడుక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం స్వామిని పెండ్లి కుమారి ఉత్సవం, రాత్రి 9.01 స్వామి వారి కల్యాణం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని తెలిపారు. భారీ అన్నదానానికి ఏర్పాట్లు చేశామని వివరించారు. సమావేశంలో సంఘ నాయకులు గంజి లక్ష్మయ్య, వూట్ల వెంకట సాంబశివరావు, ఉద్దంటి గాంధీ, రామనాథం కృష్ణ, వూట్ల నరసింహారావు పాల్గొన్నారు.


స.హ.చట్టం రక్షణకు కృషి చేయాలి

తాడికొండ: సమాచార హక్కు చట్టం రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఫోరం ఫర్ ఆర్టీఐ జాతీయ అధ్యక్షుడు పత్తిపాటి చంద్రమోహన్ అన్నారు. మంగళవారం తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివన్నారాయణతో కలసి చట్టాలతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను చంద్రమోహన్ ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ మండల అధ్యక్షుడు నల్లగొండ రాము పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రేడియో దినోత్సవం

లక్ష్మీపురం: టీవీలు, ఇంటర్నెట్‌లకు ప్రజలు ఎంత అలవాటు పడినప్పటికీ అర్థవంతమైన, ఆరోగ్యవంతమైన బాషా వినియోగానికి, భావాల ప్రసారానికి రేడియో ఎంతో ఉపయోగపడే మాధ్యమంగా ఇప్పటికీ కొనసాగుతుండటం గొప్ప విషయమని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం 'మనమూ పాడుదాం రండి' బృంద సభ్యుల ఆధ్వర్యంలో ప్రపంచ రేడియో దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో నేటికీ ఆకాశవాణి 23 భాషల్లో 179 మాండలికాల్లో ప్రసారాన్ని కొనసాగిస్తుందన్నారు. ప్రముఖ మాధ్యమాల విశ్లేషకులు వి.వి.రావ్ మాట్లాడుతూ ఆకాశవాణి వార్తలు చదువుతున్నది అద్దంకి మన్నార్, ప్రాంతీయ వార్తలు చదువుతున్నది సురమౌళి అన్న మాటలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఇలా ఎన్నో గొంతులను పాతతరం వారు మర్చిపోలేరన్నారు. ఎప్పటికీ అద్భుతమైన, అనువైన వినోద, సమాచార సాధనంగా రేడియో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో గాయకుడు సాయిబాబు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: రహదారి భద్రత నిబంధనలు విద్యార్థులకు అవగాహన అవసరమని గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రహదారిపై ప్రయాణించే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన అవసరమని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. పోటీలకు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి పి.లలిత ప్రసాద్, మోటారు వాహన తనిఖీ అధికారిణులు కె.మల్లీశ్వరి, జి.సౌమ్య పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి
- కొప్పురావూరు కాలనీలో గుడ్‌మార్నింగ్ మంగళగిరి


మహిళతో మాట్లాడుతున్న గంజి చిరంజీవి

మంగళగిరి(తాడేపల్లిరూరల్): సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని కొప్పురావూరు కాలనీలో 'గుడ్‌మార్నింగ్ మంగళగిరి' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే మా దృష్టికి తీసుకొస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల చిన్నారుల కోసం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి దాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు- నేడు కింద ఎంతో అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. జాతీయ స్థాయిలో మన ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రతిభ చాటే విధంగా తీర్చిదిద్దుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని పేర్కొన్నారు. రాబోయే కాలంలో పేద పిల్లలు ఉన్నత చదువులు చదివి వారి కుటుంబాల్లో అనూహ్యమైన మార్పులు వచ్చి పేదరికం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని వివరించారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేద విద్యార్థుల జీవితాన్ని మార్చేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి ఎంతోమంది పేదల కుటుంబాల్లో వెలుగులు నింపారని, అలాగే ఆరోగ్య విషయంలో కూడా శ్రద్ధ చూపించి పేదలకు రూపాయి ఖర్చు కాకుండా ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టారని, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రతి 30 వేల జనాభాకు ఒక వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అందులో అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారని అన్నారు. నవరత్నాల ద్వారా కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి ప్రతి కుటుంబంలో ఉన్న వారికి లబ్ధి చేకూరేలా పరిపాలన సాగిస్తున్నారని గంజి చిరంజీవి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, మాజీ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మల్లవరపు సుధారాణి, ఎంపీ ఫిరోజ్, తోట శ్రీనివాసరావు, మాలక్‌బాబు, పోలిశెట్టి ప్రసాద్, రాంబాబు, పద్మ, నాగమయ, దుర్గారావు పాల్గొన్నారు.

స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్‌పై హర్షం


హర్షం వ్యక్త చేస్తున్న స్వర్ణకారుల సంఘం

తాడేపల్లిరూరల్: స్వర్ణకారుల సంక్షేమం కోసం స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంగళగిరి పట్టణానికి చెందిన స్వర్ణకారులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ స్వర్ణకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, గుంటూరు జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ మాట్లాడుతూ స్వర్ణకారులకు ఇప్పటి వరకు పట్టించుకున్న నాథుడే లేరని చెప్పారు. స్వర్ణకారుల బతుకు భద్రం కరువైందని, ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ప్రకటించారని, ఆ ప్రకటనను చేసే తలతో పాటు స్వర్ణకారులు కూడా ఎంతో సంతోషించారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్వర్ణకారుల జీవితాల్లో మార్పు వస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్వర్ణకారులు కొల్లి లక్ష్మీ గిరిధరరావు(గిరి), దామర్ల నారాయణ, మునగపాటి రఘు, మండ్రు సత్యనారాయణ, తిరువీధుల కిరణ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచి సుబ్రహ్మణ్యం మృతి



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అభిమాని, మాజీ సర్పంచి, మాజీ ఎంపీటీసీ నెలకుదిటి సుబ్రహ్మణ్యం (75) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డిపై అభిమానంతో రాజకీయాల్లో చేరి తన స్వగ్రామమైన గొడవర్రు సర్పంచిగా విజయం సాధించారు. సుబ్రహ్మణ్యం సర్పంచిగా ఉన్న సమయంలో గొడవర్రులో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించి పట్టాలు అందజేసి ఇల్లు నిర్మించుకునేందు చొరవ చూపించారు. డాక్టర్ వైఎస్సార్ మృతి చెందిన అనంతరం, వైఎస్సార్ సీపీ ఆవిర్భావం తరువాత గొడవర్రులో ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. 2014, 2019 సంవత్సరాల్లో గొడవర్రులో ఎంపీటీసీ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొని దుగ్గిరాల మండలం వైఎస్సార్ సీపీ కైవసం అయ్యేలా కృషి చేశారు. సుబ్రహ్మణ్యం ఇటీవల కాలంలో అనారోగ్యం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు తనయుడు వెంకట్రావు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


శ్రీనివాస వరప్రసాద్‌ను అభినందిస్తున్న సుధాకర్ బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలని జేసీ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుధాకర్ బాబు పేర్కొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో రాణించిన బాపట్లలోని నరాలశెట్టివారిపాలెం నివాసి అయిన మాజీ సైనికుడు, జేసీ కళాశాలలో న్యాయ విద్యనభ్యసిస్తున్న రెడ్డి శ్రీనివాస వరప్రసాద్‌ను మంగళవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ గతనెల 6,7వ తేదీల్లో వైజాగ్‌లోని రైల్వే క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో భాగంగా షాట్‌పుట్, డిస్క్‌త్రోలో రెండు రజత పతకాలతో పాటు ఈనెల 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన జాతీయ క్రీడాకారుల చాంపియన్‌షిప్‌లో భాగంగా రాష్ట్ర క్రీడాకారుల జట్టు కవాతు ప్రదర్శనలో ద్వితీయ బహుమతి సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భానుప్రియ, శిరీష, వెంకటస్వామి, రఘురాం పాల్గొన్నారు.

వాణిజ్య సంస్థలు లైసెన్సులు కలిగి ఉండాలి

లక్ష్మీపురం: ప్రతి ఒక్క దుకాణం, వాణిజ్య సంస్థల యాజమాన్యం 1988 చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని గుంటూరు జోన్-3 జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కార్మిక కమిషనర్ ఆదేశాల మేరకు గుంటూరు జోన్-3 జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ ఆయన కార్యాలయంలో మంగళవారం వర్తక, వాణిజ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు కలిగిన, ఉద్యోగులు లేని సొంత వ్యాపారం దుకాణాలు, సంస్థలు తప్పనిసరిగా లైసెన్సు పొందాలన్నారు. ఈనెల 29వ తేదీలోగా లైసెన్సులు పొందాలని సూచించారు. దీనిపై దుకాణ, సంస్థల యాజమాన్యానికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ ఎస్.కె.ఎం.సుభాని, సహాయ కార్మిక అధికారులు, గుంటూరు కిరాణామర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవతీ పుల్లారావు, సెక్రటరీ బి.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

నెలవారీ ఉద్యోగోన్నతులు పునరుద్ధరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు నెలవారీ ఉద్యోగోన్నతుల ప్రక్రియను పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అన్ని కేడర్లలోని పోస్టులను అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయాలని కోరారు. గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులతో పాటు గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన ఖాళీలను అర్హత ఉన్న ఎస్జీటీలతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ నాయకులు పి. పార్వతి, పి. నాగ శివన్నారాయణ, ఎస్. సత్యనారాయణ మూర్తి, జి.దాస్, పి.శ్రీను, వి. కిషోర్, బాలరాజు తదితరులు ఉన్నారు.


ప్రతి ఇంటి తాగునీటి కనెక్షన్ చెక్ చేయాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి


ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి


నెహ్రూనగర్: ప్రతి ఇంటికి ఉన్న తాగునీటి కనెక్షన్ లను పరిశీలించి, ఎక్కడైనా డ్రైన్ ని క్రాస్ చేస్తూ ఉంటే వెంటనే తొలగించి, డ్రైన్ కి దూరంగా రీ కనెక్షన్ ఇవ్వాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శారదా కాలనీ రిజర్వాయర్లో ఇంటింటి వాటర్ సర్వేకి ప్రత్యేక విధులు కేటాయించబడిన ఏఈలు, డీఈఈలు క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన సర్వేపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శారదా కాలనీలో వీధుల వారిగా విధులు కేటాయించబడిన ఏఈలు ప్రతి ఇంటికి ఇచ్చిన తాగునీటి కనెక్షన్‌ను పరిశీలించాలని చెప్పారు. ఎక్కడైనా డ్రైన్‌ని క్రాస్ చేస్తూ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. అనారోగ్యానికి గురైన వారి ఇంటిలో తప్పనిసరిగా క్లోరిన్ శాంపిల్స్ తీసి, వారు వినియోగిస్తున్న నీరు, వాటర్ ట్యాంక్‌లపై సమగ్ర వివరాలు సేకరించాలని సూచించారు. కొన్ని వీధుల్లో రెండు పైప్ లైన్లు ఉన్నాయని, వాటిలో ఒక లైన్‌ని డిస్ కనెక్షన్ చేయాలని చెప్పారు. అనంతరం శారదా కాలనీ, లాంచెస్టర్ రోడ్, ఐపీడీ కాలనీల్లో ప్రజల అనారోగ్య సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. శారదకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం చికిత్స తీసుకుంటున్న వారితో మాట్లాడగా వారు గత కొనేళ్లుగా మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి తెచ్చుకున్న నీటిని తాగుతున్నామని, ప్రస్తుతం తమకు విరేచనాలు, వాంతులు అవుతున్నాయని మా దృష్టికి తీసుకొచ్చినట్లు వివరించారు. వెంటనే స్పందించిన కమిషనర్ శారదా కాలనీ, ఐపీడీ కాలనీ, సంగడిగుంట ప్రాంతాల్లో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ లను తనిఖీ చేసి, నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రమాణాలు పాటించని వాటి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఎంహెచ్ఓని ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని రీజినల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరి సివిల్ సర్జన్ బాక్టీరియాలజిస్ట్ నగరంలోని పానీపూరి బండ్లు కూడా నగరంలో ఉత్పన్నమవుతున్న అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కి లిఖితపూర్వకంగా సూచించారు. స్పందించిన కమిషనర్ శానిటరీ డివిజన్ల వారిగా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు శాంపిల్స్ సేకరించాలని ఆదేశించారు. రోడ్ల పక్కన తినుబండారాల అమ్మకందార్లు కూడా తప్పనిసరిగా ఈగలు వాలకుండా, దుమ్ము పడకకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పర్యటనలో ఎస్ఈ (ఎఫ్ ఏసీ) సుందర్‌రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు నాణ్యమైన సిమెంట్ వినియోగం తప్పనిసరి


డీలర్‌కు బీమా బాండ్ అందజేస్తున్న భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ పూల సురేష్

పెదకాకాని: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంట్ ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్ భవానీశంకర్ సూచించారు. నంబూరులో మంగళవారం రాత్రి చార్మి ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందన్నారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలను తమ కంపెనీ ఎంచు కుంటుందని తెలిపారు. భవానీ శంకర్ మాట్లాడుతూ భారతీ సిమెంట్ వినియోగించి కాంక్రీటుతో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలు చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీ లు, యజమానులకు వివరిస్తామన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు.

పంట నమోదుకు ఈకేవైసీ తప్పనిసరి



పొన్నూరు: వ్యవసాయ సంబంధిత రుణాలు పొందేందుకు రైతులు పంట నమోదుతో పాటు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని ఎంపీపీ భవనం పద్మలీల పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం మంగళవారం నిర్వహించారు. పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ రబీ సీజన్‌కు ఈ నెల 15తో పంట నమోదు ప్రక్రియ ముగియనుందని రైతులు త్వరపడాలని సూచించారు. పంట నమోదు వివరాలు సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, మండల చైర్మన్ ఎల్.పిచ్చిరెడ్డి, వ్యవసాయ అధికారి వెంకటరామయ్య, రైతులు నన్నపనేని వెంకటసుబ్బారావు, సుంకర హనుమారెడ్డి, పుప్పాల శివశంకరరావు పాల్గొన్నారు.

సొసైటీలో జనరిక్ మందుల దుకాణాలు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత


తాడికొండలో ఈ జనరిక్ మెడిసిన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

తాడికొండ: పేదలకు అతి తక్కువ ధరలకు జనరిక్ మందులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి యోజన ద్వారా మెడికల్ దుకాణాలను ఏర్పాటు చేయిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మంగళవారం తాడికొండ కో ఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ దుకాణాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడికి తక్కువ ధరలకు జనరిక్ మందులు అందించాలనే సదుద్దేశంతో ఈ దుకాణాలను ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా ఏర్పాటు చేస్తుందన్నారు. సాధారణ మెడికల్ దుకాణంలో ఇదే మందులు కొనుగోలు చేయాలంటే 70 శాతానికి పైగా అధిక ధర చెల్లించాల్సి ఉంటుందని, కానీ జనరిక్ మెడికల్ దుకాణంలో తక్కువ ధరలకే నాణ్యమైన మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు. మార్కెటింగ్ అండ్ కో ఆపరేటివ్ ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, సర్పంచి తోకల సరోజినీ, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, ఎన్‌సీడీసీ కేంద్ర విభాగం అధికారి ఎస్.జగదీశ్వరరావు, సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ బెజ్జం ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచి వెంకటరెడ్డి, నాయకులు తాళ్ల శివనాగరాజు, రాఘవరెడ్డి, చిమటా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం దుగ్గిరాల టర్మరిక్ అసోసియేషన్ హాల్‌లో అగ్నిప్రమాద బాధితుల కమిటీ సమావేశం కాజా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతనెల 19వ తేదీన కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగినా ఇంత వరకు ఎంత స్టాక్ ఉంది, ఎంతమంది రైతులు నష్టపోయారు, బీమా వివరాలు తదితర అంశాలు ఇప్పటి వరకు బయటకు రాకపోవడం విచారకరమని అన్నారు. ప్రస్తుతం పసుపు మార్కెట్ విలువ క్వింటా ధర 11,900 రూపాయలు పలుకుతోందని, ఈ ధర ప్రకారం ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఏదైనా వ్యత్యాసం ఉంటే కోల్డ్ స్టోరేజ్ యజమాని ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం తెనాలి సబ్‌కలెక్టర్ నియమించిన ఎంక్వైరీ కమిటీ చైర్మన్‌ను కలవాలని సమావేశం నిర్ణయించిందని అన్నారు. సమావేశంలో బాధితుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య, ములకా శివ సాంబిరెడ్డి, బాలరాజు, వై. బ్రహ్మేశ్వరరావు, యోగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, చంద్రశేఖర్, వెంకట అప్పారెడ్డి, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

దుగ్గిరాల ఇసుక రీచ్‌ల పరిశీలన


గొడవర్రు ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిబాబు, ఎస్ఐ ప్రతాప్‌కుమార్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కృష్ణాతీరంలోని పలు ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ రవిబాబు మాట్లాడుతూ దుగ్గిరాల మండల పరిధిలోని కృష్ణాతీరం వెంబడి గొడవర్రుతో పాటు పలు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌పై అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పలు ఆరోపణలు వస్తున్నాయని, రాత్రి సమయంలో కూడా రెవెన్యూ, పోలీస్ శాఖ వారు ఉమ్మడిగా తనిఖీలో చేస్తారని చెప్పారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తుంటే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశీలనా కార్యక్రమంలో దుగ్గిరాల ఎస్ఐ ప్రతాప్ కుమార్‌తో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ


వైద్య శిబిరంలో రోగులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: ఈ నెల 4న నంబూరు గ్రామంలో నేత్రజ్యోతి శిబిరం ద్వారా వైద్య పరీక్షలు చేసి 849 మందికి కళ్ళజోళ్ళు అవసరమని గుర్తించారని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. వారందరికీ బుధవారం కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ నంబూరు గ్రామంలో కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తామని తెలిపారు. వ్యక్తిగత కళ్ళజోళ్ళకు అందుబాటులో ఉండి తమ కళ్ళజోళ్ళను పొందాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

పదిమందికి యాంజియోగ్రామ్ ...

పెదకాకాని గ్రామంలో ఈ నెల 11,12 తేదీల్లో బజరంగ్ సంక్షేమ సంగమం వైద్య శిబిరంలో మీగుండె పదిలం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గుండె సంబంధిత వైద్య పరీక్షల్లో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 18 మంది పేషెంట్లను గుర్తించారు. వారిలో మొదటి విడతగా 10 మందిని చికిత్స నిమిత్తం మంగళవారం ప్రత్యేక బస్సులో విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరికి స్టంట్స్, ఇద్దరికి బైపాస్ సర్జరీ అవశ్యకత ఉన్నట్లు వైద్యులు ధృవీకరించారు. ఆసుపత్రికి వెళ్ళి బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ యాంజియోగ్రామ్‌కు హాజరైన పేషెంట్లను పరామర్శించారు.

రేపు అగ్రిగోల్డ్ బాధితుల న్యాయపోరాట దీక్ష

తాడేపల్లిరూరల్: అగ్రిగోల్డ్ బాధితుల కోసం న్యాయపోరాట దీక్ష ఈనెల 15వ తేదీ విజయవాడలో నిర్వహించనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వేమువల్లి శ్రీకృష్ణభవన్లో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్య దోషులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన తిరుపతయ్య, అగ్రిగోల్డ్ కస్టమర్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు డి.చక్రధర్ బాబు, నియోజకవర్గ కార్యదర్శి పి.కృష్ణ, కోశాధికారి గౌరీ శంకర్, సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, గోహర్ జానీ పాల్గొన్నారు.